క్లుప్తంగా

ఈ-క్రాప్ తప్పనిసరి



ఎంపీఈఓలతో సమీక్షిస్తున్న ఏడీఏ గోపీనాయక్

చిల్లకూరు: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయాలని గూడూరు ఏడీఏ గోపీనాయక్ సూచించారు. మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం ఎంపీఈఓలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరి ఈ-క్రాప్ చేసేందుకు వీలు లేదని, పంట పెట్టిన ప్రాంతానికి తప్పనిసరిగా వెళ్లి, అక్కడ నుంచే లాగిన్ కావాల్సి ఉందన్నారు. అలాగే రబీ సీజన్ ప్రారంభానికి ముందుగానే ప్రభుత్వం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందించేందుకు సిద్ధం అవుతున్నందున ఆర్బీకేల వారీగా విత్తనాలను అందించే వీలుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఓ గూడూరు భవానీ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ లక్ష్యం సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

పెళ్లకూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ సురేష్‌బాబు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 13 సచివాలయాల పరిధిలో మొత్తం 412 జగనన్న ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. పలు లేఅవుట్లలో పనులు చేపట్టకపోవడం ఏమిటని?, ఇది క్షేత్రస్థాయి అధికారుల పనితీరుకు నిదర్శనమని చెప్పారు. ఇప్పటివరకు 220 ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తహసీల్దార్ రామ య్య, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న కుమారరాజ

రాపూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని గురువారం నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమారరాజ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు, పుస్తకాలు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించారు. స్థానిక గ్రంథాలయంలో శ్లాబ్ పడిపోతుందని, వర్షం వస్తే గ్రంథాలయం అంతా ఉరుస్తోందని, పుస్తకాలు భద్రపరిచేందుకు సరైన బీరువాలు, మరుగుదొడ్లు లేవని గ్రంథాలయాధికారి ధనమ్మ ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఏఎల్‌సీఎం క్రీడామైదానంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పరసా కస్తూరి రత్నం వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరానికి నియోజవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వందలాది మంది హాజరై, పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే పరసా రత్నం, షాలినీ రత్నం, సతీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

గూడూరురూరల్: పట్టణంలోని సంగం థియేటర్ కూడలి వద్ద గురువారం హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కే పెంచల నాయుడు ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ బోల్తా



బోల్తా పడిన టిప్పర్

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలో తాళ్వాయిపాడు వద్ద గురువారం మట్టి టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. రావులపాడు గ్రామం తాళ్వాయిపాడు, పెన్నేపల్లె, నాయుడుపేట తదితర ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మట్టిలోడ్‌తో వెళుతున్న టిప్పర్ తాళ్వాయిపాడు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

ఉపాధి ఫలం.. కూలీకి బలం

వలసల నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ఇటు కూలీలకు, అటు పల్లెల ప్రగతికి దోహదపడుతోంది. ఈ పథకం ఇప్పుడు అన్ని రంగాలకు అనుసంధానమవుతోంది. దీంతో కుటుంబంలో ప్రతి ఒక్కరికీ అక్కరకొస్తోంది. వ్యక్తిగత లబ్ధితోపాటు సమాజశ్రేయస్సుకు ఊతమిస్తోంది.

- ఓజిలి మండలంలో రూ.7.5 కోట్లతో పనులు
- రోజుకు రూ.272 నగదు గిట్టుబాటు
- ఉపాధి పనులతో కూలీల ఆర్థికాభివృద్ధి



భట్లకనుపూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఓజిలి: జాతీయ ఉపాధిహామీ పథకం కూలీలకు కొండంత అండగా నిలుస్తోంది. ఏటా గరిష్ఠంగా చెల్లిస్తున్న రోజువారీ కూలీని పెంచుతూ వస్తోంది. 2022-23లో కూలిని రూ.245 నుంచి రూ.257కు ప్రభుత్వం పెంచింది. ఈ ఏడాది మరో రూ.15 పెంచింది. ప్రస్తుతం ఇస్తున్న రోజువారీ కూలి రూ.257 నుంచి రూ. 272కు చేరింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి వచ్చిన ఈ వేతనం 2024 మార్చి 31 వరకు అమలులోకి ఉంటుంది. ప్రస్తుత సంవత్సరం మార్చి, ఏప్రిల్, మే, జూన్ నాలుగు నెలలు పనులు ముమ్మరంగా జరిగాయి. ఫీల్డ్ చానళ్లు, నీటి సంరక్షణ పనులు, కాలువలు, చెక్‌డ్యామ్‌ల్లో పూడికతీత పనులు జరిగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి మండలంలో రూ.7.5 కోట్లతో పనులు మంజూరు కాగా ప్రతి కుటుంబానికి నూరు రోజులు పనులు కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. పనులతో పాటు కూలి పెరగడంతో కూలీలకు మరింత ఆర్థిక భరోసా కలిగింది. మండలంలో 8,826 జాబ్‌కార్డులుండగా 3 వేల మంది ప్రతిరోజు ఉపాధి పనులకు వస్తున్నారు.

ఆధార్‌కు జాబ్‌కార్డు అనుసంధానం

ఉపాధిహామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం జాబ్‌కార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానం చేసింది. గతంలో పనికి వెళ్లకపోయినా బోగస్ మస్టర్లు వేసి, కొంతమంది క్షేత్రసహాయకులు అవినీతికి పాల్పడేవారు. ఈ విధానానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఆధార్‌తో జాబ్‌కార్డు అనుసంధానం చేస్తోంది. పనికి వచ్చిన ప్రతి ఒక్కరి ఫొటోను సిబ్బంది తీసి, ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడం ద్వారా పనులలో పారదర్శకత పెరగడంతోపాటు ఉపాధి హామీ పనికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ గిట్టుబాటు వేతనం దక్కుతుంది.

కూలి పెరిగింది



రోజువారీకూలి పెంచడం ఎంతో ఉపయోగం. ఒక కుటుంబంలో నలుగురు పనులకు వెళితే వారికి అదనంగా రూ.60 వస్తోంది. ప్రభుత్వ అధికారులు ఇచ్చిన కొలతల మేరకు పనిచేస్తే ఒక్కొక్కరికి రూ.272 నగదు గిట్టుబాటు అవుతుంది. ఉపాధి పనులు పేదకుటుంబాలకు వరంగా మారాయి. - వెంకటేశ్వర్లు, భట్లకనుపూరు

గత ఏప్రిల్ నుంచి అమలు చేస్తున్నాం



గత ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రోజువారీ కూలిని ప్రభుత్వం పెంచింది. ఈ ఏడాది మరో రూ.15 పెంచింది. పెరిగిన రూ.15తో రోజువారీ కూలీ రూ.272 గిట్టుబాటు అవుతుంది. అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పిస్తున్నాం. నా భూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా కూలీలు మొక్కలు నాటుతున్నారు. -ఏపీఓ ఉషారాణి ఓజిలి

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వెంకటరమణ

డక్కిలి: మండలంలోని ఆల్తూరుపాడు, దందవోలు, శ్రీపురం పంచాయతీల్లో నిర్వహించనున్న వార్డు సభ్యుల ఎన్నికలు సజావుగా నిర్వహించాలని గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వార్డు ఎన్నికలు-2023 సందర్భంగా స్టేజ్-2 అధికారులతో ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వార్డు ఎన్నికల ప్రక్రియను శాంతియుత వాతావరణంలో వివాదాలకు తావు లేకుండా నిర్వహించాలన్నారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటలు నుంచి ఓట్లు లెక్కింపు ఉటుందన్నారు. అందుకు అనుగుణంగా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఈఓపీఆర్డీ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అందరూ అండగా నిలవాలి



పుష్పాలతో తీర్చిదిద్దిన రంగవల్లులను తిలకిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల వారు అండగా నిలవాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని ద్వారకపురం, మాబాక గ్రామాల్లో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు రహదారులను పూలతో రంగవల్లులు తీర్చిదిద్ది, ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. శాలువ కప్పి సత్కరించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. గ్రామాల్లో ప్రజలు పలు సమస్యలను విన్నవించడంతో ఎమ్మెల్యే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజు నుంచే జనరంజక పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే వెంకటరమణారెడ్డి, కే భవానీ రెడ్డి, సర్పంచ్ శ్రావణి, సచివాలయల జేసీఎస్ కన్వీనర్ ఓ కిషోర్‌యాదవ్, ఎంపీపీ ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ మమత, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఖాజా గరీబ్‌బాషా, నాయకులు పీ రాహుల్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.




బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

కట్టాకు ఎమ్మెల్యే పరామర్శ

ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురువారం వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డిని పరామర్శించారు. కొద్దిరోజులు కిందట సుధాకర్‌రెడ్డి మేనకూరులో ఇంటి వద్ద కాలుజారి పడి గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి, పరామర్శించారు.

సన్మానం



ప్రిన్సిపల్ గురవయ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

నాయుడుపేట: ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నాయుడుపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కే గురవయ్యను కళాశాలలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు గురువారం సన్మానించారు. నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు ఆయనకు శాలువ కప్పి సత్కరించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, ఈశ్వరయ్య, సురేష్, సౌజన్య, సుధ, సుగుణ, సునీత, సులోచన, అనిత, కవిత, స్వర్ణ, ప్రసన్న, రమణారావు బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల చోరీలు.. ఆందోళనలో రైతులు



ధ్వంసం చేసిన మోటారు

నాయుడుపేటటౌన్: మండలంలోని పలు గ్రామాల్లో తరచూ వ్యవసాయ విద్యుత్ మోటార్ల చోరీలు జరుగుతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా గత శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని మూర్తిరెడ్డిపాళెంలో తాండ్ర సుబ్రహ్మణ్యం పొలంలో ఉన్న వ్యవసాయ విద్యుత్ మోటారును ధ్వంసం చేసి, అందులో రాగి వైరును చోరీ చేశారు. ఇతనొక్కడే కాదు, మండలంలోని పలువురు రైతులకు చెందిన మోటార్లు చోరీకి గురయ్యాయి. మోటార్ల చోరీల విషయమై పోలీసులకు ఫిర్యాదులు చేసినా, అవి బుట్ట దాఖలవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. మోటార్ల చోరీలపై పోలీసులు నిఘా పెట్టి దొంగలను పట్టుకుని, రైతులను న్యాయం చేయాలని కోరుతున్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

దొరవారిసత్రం: మండలంలోని పాళెంపాడు ఎస్సీ కాలనీల్లో టీటీడీ సౌజన్యంతో నిర్మించిన ఆలయంలో శుక్రవారం మాతాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెంకటరమణయ్య తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూళ్లూరుపేటరూరల్: మండలంలోని మంగానెల్లూరు సచివాలయం పరిధిలోని వలంటీర్ పోస్టు భర్తీకి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ ప్రమీలారాణి పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీన ఇంటర్వ్యూ, 23వ తేదీన వలంటీర్ ఎంపిక జరుగుతుందని తెలిపారు.

లిఖిత పూర్వకంగా ఇవ్వండి

చిల్లకూరు: రీ సర్వేలో ఏవైనా అభ్యంతరాలుంటే లిఖిత పూర్వకంగా తహసీల్దార్‌కు వినతులు ఇవ్వాలని వీఆర్వో రామచంద్రయ్య తెలిపారు. మండలంలోని అద్దెపల్లె రెవెన్యూలో ఉన్న సుమారు 700 ఎకరాలను జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం కింద రీసర్వే పనులను సర్వే బృందాలు వారం రోజుల్లో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దెపల్లె రెవెన్యూలోని అన్ని రకాల భూములను రీ సర్వే చేసి వివరాలను సంక్షిప్తం చేశామన్నారు.

సద్వినియోగం చేసుకోండి

డక్కిలి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో వెంకటగిరి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ 14 కంపెనీలకు సంబంధించి దాదాపు 800 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. వివరాలకు 94914 58910, 91775 08279 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మండల మీట్ రేపు

డక్కిలి: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల19వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ జీ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

పాముకాటుతో రైతు మృతి

కోట: పొలాల్లో పనిచేసుకుంటున్న రైతు పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన గురువారం కోట మండలం కొత్తపట్నంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కథనం మేరకు.. కొత్తపట్నం గ్రామానికి చెందిన రైతు చెంచయ్య(43) పొలంలో పనిచేస్తుండగా పాముకాటుకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గుర్తించిన తోటి రైతులు, కుటుంబ సభ్యులు ఆయన్ని చికిత్స నిమిత్తం కోట పట్టణానికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

చిల్లకూరు(చిట్టమూరు): పాఠశాలలో ఎన్‌సీసీ ఏర్పాటుతో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని నెల్లూరు ఎన్‌సీసీ యూనిట్ కమాండర్ వినయ్ రామచంద్రన్ అన్నారు. చిట్టమూరు మండలం మెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్‌సీసీ 10ఏ నావల్ యూనిట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశభక్తి, క్రమశిక్షణ, ధైర్యసాహసాలు పెంపునకు ఎన్‌సీసీ ఎంతగానో దోహద పడుతుందన్నారు. అలాగే ఎన్‌సీసీ కాడెట్‌లను అత్యవసర పరిస్థితిలో ప్రభుత్వం వినియోగించుకుంటుందన్నారు. అనంతరం 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి, యూనిట్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పార్థసారథి, ఉప సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, నాగూర్‌రెడ్డి, ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ శివకుమార్, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్ సంతోష్, శ్రీనివాస్, బాలచంద్ర పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సైదాపురం: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: నిరుపేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీకవోలు సచివాలయం పరిధిలోని చీకవోలు, అన్నంరాజుపల్లె, రాజులఎరుగుంటపాళెం ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల ప్రజలు నేదురుమల్లికి ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి, బుక్‌లెట్‌లను అందజేశారు. అనంతరం నేదురుమల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ప్రథమస్థానంలో నిలిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం రవికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి డీ శంకర్‌రాజు, జేసీఎస్ కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, నేతలు ఎం దామోదర్‌రాజు, రమేష్‌రాజు, పీ గంగాధర్, టీ శంకర్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వీ ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, జనార్దన్‌రాజు, మాల కొండారెడ్డి, అబ్బిరాజు, పీ శ్రీనివాసులురాజు పాల్గొన్నారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ

వెంకటగిరిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమకు గడప గడపలో అపూర్వ ఆదరణ లభిస్తోందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 19, 20వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వారాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. కౌన్సిలర్లు కే మల్లీశ్వరి, వహిదా, కళ్యాణి, ఏ శ్రీనివాసులు, సుబ్బారావు, పార్టీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి సీ హరికృష్ణ, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, విప్ పీ లక్ష్మి, నేతలు యస్థానీబాషా, కే సతీష్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటగిరిరూరల్: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రత్నప్రసాద్ తెలిపారు. మండలంలోని అమ్మపాళెంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగులో అధికారుల సూచనలు పాటిస్తే నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని తెలిపారు. ఏడీఏ నాగార్జునసాగర్ మాట్లాడుతూ వరి పంటను కాండం తొలుచు పురుగులు, ఆకుముడత పురుగులు ఆశిస్తాయని, వీటి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్సీ ఏఓ వేణుగోపాల్, ఎంఏఓ సుజాత, ఏఈఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు



కొత్తబోరు ప్రారంభోత్సవంలో చైర్‌పర్సన్ దీపిక

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలో తాగునీటి సమస్యలను యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి, ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. గిడివారితోట అల్యూమినియంవారి వీధిలో కొత్తగా వేసిన బోరు పాయింట్ నుంచి తాగునీటి సరఫరాను గురువారం ఆమె ప్రారంభించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని 7, 8 వార్డులకు సబంధించి రాజగోపాలపురం, గిండివారితోట తదితర ప్రాంతాల్లో కొద్ది రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా లేక స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో సుమారు రూ.3.25 లక్షల వ్యయంతో కొత్తగా బోరు తవ్వి, పైపులైన్‌లు వేసి సమస్యను పరిష్కరించామన్నారు. కౌన్సిలర్లు జీ అరుణ, టీ విజయ్, పోలేరమ్మ ఆలయ చైర్మన్ జీ సిద్ధయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కే జయరామయ్య పాల్గొన్నారు.

175 నియోజకవర్గాలూ వైఎస్సార్ సీపీవే



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని, ఈ ప్రభంజనం సృష్టించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని ఎన్‌జేఆర్ భవనంలో గురువారం వెంకటగిరి నియోజకవర్గంలోని జేసీఎస్ మండల కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. దేశానికే ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. ఇందుకు నిదర్శనం రాష్ట్రంలో టీడీపీ క్లీన్ స్వీప్ కావడం ఖాయమని టైమ్స్‌నౌ చేసిన సర్వేలో తేటతెల్లమవుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో వెంకటగిరి నియోజవర్గంలో అత్యధిక మెజార్టీతో సాధించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు.

పాళెంకోట సర్పంచ్‌కు అభినందన

పంచాయతీ ఉపఎన్నికల్లో ఏకగ్రీవమైన పాళెంకోట సర్పంచ్ యాకసిరి వేణుగోపాలరెడ్డిని నేదురుమల్లి అభినందించారు. గురువారం నేదురుమల్లిని వెంకటగిరిలోని ఆయన నివాసంలో వేణుగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వేణుగోపాల్‌రెడ్డిని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందించి, మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నేతల సమష్టి కృషి ఫలితమే పాళెంకోట సర్పంచ్ స్థానం ఏకగ్రీవం అయ్యిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఇదే తరహాలో శ్రమించి వెంకటగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ నాయకులు సదారెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, జేసీఎస్ ఇన్‌చార్జి ఎం వెంకటేశ్వర్లు, ఏ గిరియాదవ్ పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌పై హర్షం

గూడూరురూరల్: రాష్ట్రంలో 2014 సంవత్సరానికి ముందు నుంచి ప్రభుత్వ సంస్థల్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జి నారపరెడ్డి రాజారెడ్డి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా వేలాదిమంది పనిచేస్తున్నారని, ఎప్పుడైనా తమను రెగ్యులరైజేషన్ చేస్తారనే ఆశతో ఉండేవారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు కాంట్రాక్ట్ ఉద్యోగులను ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత సీఎం జగన్ మోహన్‌రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఇచ్చిన మాట మేరకు వారిని రెగ్యులరైజేషన్ చేస్తూ ఫైల్‌పై సంతకం చేయడం సంతోషదాయకమని అన్నారు.

స్వల్పంగా పెరిగిన నిమ్మ ధరలు



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న రైతు

సైదాపురం: సాధారణంగా ఆగస్టు నెలలో నిమ్మకాయలు కొనుగోలు చేసేవారు త క్కువ కావడంతో ధ రలు తగ్గుతాయి. అయితే గత వారం రోజులుగా ని మ్మ ధరలు స్వల్పంగా పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో నిమ్మకాయలు రూ.25 నుంచి రూ.40 ధర పలుకుతున్నాయి. నాణ్యత కలిగిన కాయలు ధర రూ.40 వస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. సైదాపురం మండలంలో అధిక శాతం మంది రైతులు నిమ్మ పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. నిమ్మకు అధిక ధరలు లభిస్తుండటంతో రైతులు ఆనందంగా ఉన్నారు.